ప్రజాశక్తి
బుధవారం 11 డిసెంబర్ 2024
5
విజయనగరం



14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

ఈనెల 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్‌చక్రవర్తి సూచించారు. మంగళవారం ఎస్‌సి, ఎస్‌టి కోర్టుహాల్‌లో ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలకు సంబంధించిన అధికారులతో సమావేశం నిర్వహించారు. మోటారు ప్రమాద బీమా కేసులకు సంబంధించి జరగబోయే జాతీ లోక్‌అదాలత్‌తో ఎక్కువ కేసులు పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో న్యాయమూర్తులు ఎస్‌సి, ఎస్‌టి కోర్టు జడ్జి బి.అప్పలస్వామి, ఫ్యామిలీ కోర్టు జడ్జి కె.విజయ కల్యాణి, మహిళా కోర్టు జడ్జి పద్మావతి, పోక్సోకోర్టు జడ్జి కె.నాగమణి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి టివి రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాల న్యాయమూర్తులతో న్యాయమూర్తి రాజేష్ వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతూ రాజీ పడదగిన కేసులన్నింటినీ పరిష్కరించాలని సూచించారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న సిపిఎం శ్రేణులు

ఉత్సాహంగా సిపిఎం మహాసభ

- పాలకుల నిర్లక్ష్యం వల్లే మన్యం వెనుకబాటు
- దృష్టి మళ్లించేందుకు మత చీలికలు
- వనరులున్నా వినియోగానికి చొరవ చూపని పాలకులు
- గిరిజన ప్రాంతం పట్ల వివక్ష
- ఎర్రజెండా అండతో ప్రజా పోరాటాలు
- సిపిఎం మహాసభలో నాయకులు

ప్రజాశక్తి - కురుపాం/పార్వతీపురం

పాలకుల నిర్లక్ష్యం వల్లే మన్యం జిల్లా అన్ని విధాలా వెనుకబడి పోయిందని సిపిఎం నాయకులు అన్నారు. సిపిఎం మన్యం జిల్లా పదో మహాసభలు సాయి నందక కళ్యాణ మండపంలో మంగళవారం అత్యంత ఉత్సాహపూరితంగా ప్రారంభమయ్యాయి ఈ సందర్భంగా రావాడ జంక్షన్లో సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ లాటీలు తూటాలతో జరిగిన నిర్బంధాలను, బెదిరింపులను ఎదుర్కొనే చరిత్ర పార్వతీపురం మన్యం జిల్లాకు ఉందని గుర్తు చేశారు. పల్లె రాములు మాస్టారు, న్యాయవాదైన పరవాడ లక్ష్మునాయుడు సహకారంతో కురుపాం, గుమ్మలక్ష్మం పురం ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమానికి అంకురార్పణ జరిగిందని తెలిపారు. నాటి నుంచి ప్రజా సమస్యలపైన, ముఖ్యంగా గిరిజనుల దోపిడీకి వ్యతిరేకంగా అనేక పోరాటాలు నడిచాయని గుర్తు చేశారు. అయినప్పటికీ మన్యం జిల్లా, ముఖ్యంగా గిరిజన ప్రాంతం విద్య వైద్యం రహదారులు తదితర సదుపాయాలకు నేటికీ దూరంగానే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మన్యంలో జరిగిన నాటి పోరాట స్ఫూర్తితో తోటపల్లి నిర్వాసితుల కోసం సిపిఎం పోరాడి మెరుగైన నష్టపరిహారం, పునరావాసం కల్పించిందని, అలా అందర్నీ ఏకం చేయగలిగే శక్తి ఎర్రజెండాకు మాత్రమే ఉందని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ జిల్లాలో సాలూరు, పాచిపెంట, సీతంపేట భామిని తదితర ప్రాంతాల్లో భూ సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి సిపిఎం పోరాడుతుందని అన్నారు. గిరి శిఖర గ్రామాల్లో విద్య, వైద్యం, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు లేవన్నారు. వీటన్నిటి పైన మహాసభల్లో చర్చించి పరిష్కారానికి తగిన కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో సాగు, తాగునీరు, గిరిజనుల హక్కుల సాధనకు 1/70 చట్టం అమలు కావాలంటే కేవలం ఎర్రజెండా సిపిఎం తప్ప ఇంకే పార్టీలు గిరిజనుల పక్షాన నిలబడవని అన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్



మహాసభ ప్రాంగణంలో సిపిఎం జెండాను ఎగురవేస్తున్న సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి

వెనుకబాటుతనంపై నోరెత్తని ఎమ్మెల్యేలు

అత్యంత వెనుకబడిన మన్యం జిల్లా సమస్యలపై ఈ ప్రాంత ఎమ్మెల్యేలు నోరు మెదపడం లేదు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు మెరుగైన వైద్యం కోసం తగిన ఆసుపత్రి లేదు. నిత్యావసర ధరలు భారీగా పెరిగాయి. సమస్యలను పక్కదారి పట్టించేందుకు ఒకే దేశం, ఒకే ఎన్నికల పేరుతో మతచిచ్చు రేపాలని బిజెపి ప్రయత్నిస్తోంది

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ

ఆశ్రమ పాఠశాలల్లో అక్షయపాత్రపై పోరాటం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల కు అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా భోజనాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. అన్న క్యాంటీన్లకు సరఫరా చేస్తున్న రీతిలో ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం పంపిణీ చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దీని వల్ల విద్యార్థులకు పౌష్టికాహారం అందబోదు. వందలాది మంది ఉపాధి కోల్పోతారు. ఆశ్రమ పాఠశాలలో ఎఎన్ఎంల నియామకంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది.

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అశోక్

గిరిజనుల ఎదుగుదలకు బిజెపి ఆటంకం : తులసీదాస్

ఆదివాసి గిరిజనుల ఎదుగుదలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్ర ఆటంకంగా మారిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. గడచిన పదేళ్లలో గిరిజన చట్టాలను బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. గిరిజనులు పోరాడి సాధించుకున్న గిరిజన కార్పొరేషన్ ద్వారా గతంలో అటవీ ఉత్పత్తులను సేకరించి గిట్టుబాటు ధర కల్పించే వారని, నేడు అటువంటి సేవలు అందించే పరిస్థితిలో ఆ సంస్థ లేదని అన్నారు. వీటన్నిటితో పాటు ఎన్నికల హామీలను అమలు చేయాలని గిరిజనులు పోరాడుతుంటే వారిని, మతం, తెగల పేరుతో గిరిజనుల మధ్య చిచ్చు పెడుతోందని విమర్శించారు. పిటిజిల సమస్యలు పరిష్కరించేందుకు, సవర భాషా వాలంటీర్లను కొనసాగించేందుకు మేనమేషాలు లెక్కిస్తుందని విమర్శించారు. ఈ నేపథ్యంలో మన్యంలో గత పోరాటాలను పూర్తిగా తీసుకొని ప్రభుత్వం మెడలు వంచేందుకు ప్రజలంతా కదలాలని పిలుపునిచ్చారు.

సాగునీటి ప్రాజెక్టుల నిర్లక్ష్యం

రాష్ట్రంలో మన్యం జిల్లా అత్యంత వెనుకబడిన జిల్లాగా ఉంది. వనరులున్నా పాలకులు విని యోగించడం లేదు. 50ఏళ్ల గా జంఝావతి ప్రాజెక్టును పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఏటా బడ్జెట్ లో జంఝావతి ప్రాజెక్టుకు రూ.5 కోట్లు కేటా యించినట్లు చెప్పడం తప్ప ఆచరణలో శూన్యం. రాష్ట్ర విభజనలో భాగంగా మంజూరైన గిరిజన యూనివర్సిటీని మెంటాడలో నిర్మాణానికి గత ప్రభుత్వం హయాంలో శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులు కూడా జరుగుతున్నాయి. టిడిపి ప్రభుత్వం ఈ గిరిజన యూనివర్సిటీని అక్కడ నుంచి తరలిస్తామని చెబుతుండడం అన్యాయం. పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయి.

- సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి

ఎరుపెక్కిన కురుపాం

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి/కురుపాం

సిపిఎం మన్యం జిల్లా 10వ మహాసభలు కురుపాంలో అత్యంత ఉత్సాహ పూరితంగా మంగళ వారం ప్రారంభమ య్యాయి. మహాసభ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు హాజరయ్యే ందుకు గిరిశిఖర గ్రామాల ఆదివాసి గిరిజనులు తెల్లవారక ముందే కొండలు గుట్టలు దాటుకుంటూ కురుపాం మండల కేంద్రానికి చేరుకున్నారు. కొందరు మహిళలు చంటి బిడ్డలను ఎత్తుకుని, వృద్ధులు ఊత కర్రలు పట్టుకుని ర్యాలీ, సభలలో పాల్గొనడం విశేషం. కొందరు యువకులు విల్లంబులు చేతబూని గిరిజన సంప్రదాయ వేటను, అడవితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు. ఇటు మైదాన ప్రాంతాలకు చెందిన పార్టీ శ్రేణులు కూడా భారీగా చేరుకున్నారు. ఇలా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పరస్పర పలకరింపులు, ఆలింగనాలతో పండగ వాతావరణం కనిపించింది. అనంతరం కురుపాం పాత బస్టాండ్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా రావాడ జంక్షన్ వరకు భారీ ప్రదర్శన సాగింది. ప్రదర్శన ముందు వరుసలో ఎర్ర జెండాలను చేబూనిన మహిళలు సమరోత్సాహాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా కురుపాం ప్రధాన రహదారి ఎర్రబారింది. అగ్రభాగంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. పుణ్యవతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, కె.సుబ్బారావమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్, జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు నిలిచారు. ప్రదర్శనకు ముందు భాగంలో మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు కమ్యూనిస్టుల క్రమశిక్షణకు అద్దం పట్టింది. బహిరంగ సభ అనంతరం సాయినందక కళ్యాణ మండపంలో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. మహాసభల ప్రారంభ సూచికగా సిపిఎం జెండాను ఆ పార్టీ సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి ఆవిష్కరిం చారు. ప్రతినిధుల సభకు అధ్యక్షవర్గం గా ఎం.తిరుపతిరావు, మర్రి శ్రీనివాసరావు, రెడ్డి శ్రీదేవి, మండంగి రమణ వ్యవహరించారు. తొలుత అమరుల చిత్రపటాలకు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు



ర్యాలీ నిర్వహిస్తున్న పౌల్ట్రీ కార్మికులు, సిఐటియు నాయకులు

సమస్యలు పరిష్కరించకుంటే ఉధృత పోరాటం

పౌల్ట్రీ కార్మికుల ర్యాలీలో సిఐటియు నాయకులు టివి రమణ

ప్రజాశక్తి-చీపురుపల్లి

కర్లాం గ్రామం వద్ద ఉన్న వెంకటరామా పౌల్ట్రీ యాజమాన్యం వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పలు రూపాల్లో ఆందోళనను ఉధృతం చేస్తామని సిఐటియు నాయకులు టివి రమణ అన్నారు. చీపురుపల్లి సమీపంలో గల గెడ్డ మిల్లు వద్ద నుంచి సుమారు రెండున్నర కిలోమీటర్లు తహాశీల్దారు కార్యాలయం వరకు సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం పెద్ద ఎత్తున కార్మికులు ర్యాలీచేశారు. ఈసందర్భంగా టివి రమణ మాట్లాడుతూ 2024 మే 31తో వెంకటరామా పౌల్ట్రీలో పని చేస్తున్న కార్మికులకు సంబందించిన పాత వేతన ఒప్పందం ముగిసిందన్నారు. తిరిగి జూన్ 1, 2024 నుంచి నూతన వేతన ఒప్పందం అమలు చేయాల్సి ఉందని అన్నారు. అయితే యాజమాన్యం 6 నెలలు పూర్తవుతున్నప్పటికీ చర్చల పేరుతో కాలయాపన చేస్తోందన్నారు. రెండు నెలలు పరిశ్రమ దగ్గర రెండు నెలలు డిసిఎల్ దగ్గర, రెండు నెలలు, జెసియల్ దగ్గర చర్చలు చేస్తూ కాలయాపన చేస్తోంది తప్ప పురోగతి లేదన్నారు. తమకు కనీస వేతనం ఇప్పుడు ఇస్తామని చెబుతుందంటే గత 12 సంవత్సరాలుగా కార్మికుల శ్రమను యాజమాన్యం దోచుకున్నట్లేనన్నారు. 15 ఏళ్ల క్రితం వచ్చిన జిఒకు ఇప్పుడు స్పందించి కనీస వేతనం ఇస్తామంటే కుదరదని, ఇప్పుడు ఇస్తున్న జీతానికి అదనంగా మరో రూ.3వేలు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ పలు రూపాల్లో ఆందోళణ కార్యక్రమాలు చేపడతా మన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే వారం రోజులుగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరశన తెలిపామని కనీసం యాజమాన్యానికి చీమ కుట్టినట్టైనా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం ఇప్పటికైన స్పందించకపోతే పోరాటం మరింత ఉధృతం చేసి వచ్చే సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు అంబళ్ల గౌరినాయుడు, వెంకటరామా పౌల్ట్రీ కార్మిక నాయకుడు ఇప్పిలి గురునాయుడు, ఈశ్వరరావుతో పాటు కార్మికులు పాల్గొన్నారు.


సమర్ధవంతంగా అన్న క్యాంటీన్ల నిర్వహణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో అన్నా క్యాంటీన్లను మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు మరింత కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. మంగళవారం నగరంలోని అన్నా క్యాంటీన్లను ఆయన పరిశీలించారు. ముఖ్యంగా ఆహారం సుచిగా ఉందా లేదా అనే విషయమై ఆహారం స్వీకరిస్తున్న వారిని అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నాయా లేదా తనిఖీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పౌష్టికాహారం, వేడివేడి ఆహార పదార్థాలను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఇ పార్వతీ తదితరులు పాల్గొన్నారు.

గుంతల మరమ్మతులు పరిశీలన

నగరంలోని రహదారుల పాక్షిక మరమ్మత్తు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి ప్రజా వినియోగంలోకి తీసుకువస్తున్నామని కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. నగరంలో వివిధ ప్రాంతాలలో చేపడుతున్న గుంతలు పూడ్చివేత పనులను కమిషనర్‌తో పాటు ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. గణేష్ కోవెల ఎదురుగా గంజిపేట ప్రాంతంలో 25 ఇళ్లకు పైపులైను లేదని స్థానికులు కోరగా వెంటనే వాటికి కూడా అంచనాలు రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా క్షేత్రస్థాయి పరిశీలనలు చేపట్టారు. అనధికారికంగా ప్రభుత్వ స్థలాలను, చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే ఎట్టి పరిస్థితులలోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.



క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

సాలిపేటలో ఆక్రమణల తొలగింపు

నగరంలోని సాలిపేట రహదారిలో ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక ఆక్రమణలను, పట్టణ ప్రణాళిక సిబ్బంది మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే సహించబోమని స్పష్టం చేశారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

పేకాట, కోడిపందేలపై నిఘా : ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట



నేరాలను నియంత్రించేందుకు అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ఇందుకుగాను అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిపై నిఘా ఏర్పాటు చేసి, దాడులను విస్తృతం చేశామన్నారు. పేకాట, కోడిపందాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. సహేతుకరమైన కారణం లేకుండా రాత్రి 11గంటలు తరువాత బయట తిరగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. కారణం లేకుండా రాత్రి సమయాల్లో అనుమానస్పదంగా సంచరించే వ్యక్తులపై కేసులు నమోదు చేస్తున్నామని, వారిని పోలీసు స్టేషనులకు తరలించి, తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగు నిర్వహించి పంపుతున్నామన్నారు. అనధికారంగా మద్యం విక్రయాలు చేపట్టే వారిపై కఠినంగా వ్యవహరిస్తూ, వారిపై కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగు నిర్వహిస్తూ, వాహన తనిఖీలు చేపడుతూ, పశువులను అక్రమంగా తరలించే వారిపైన, ఎం.వి.నిబంధనలు ఉల్లంఘించినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగించినా, మద్యం సేవించి వాహనాలు నడిపినా ఉపేక్షించేది లేదని, వారిపై కేసులు తప్పవని హెచ్చరించారు. గత వారం రోజుల్లో పేకాట, కోడి పందాలు ఆడుతున్న వారిపై 11 కేసులు నమోదు చేసి 56 మందిని అరెస్టుచేసి, వారి వద్ద నుండి రూ.86,134 నగదు, 5 కోడి పుంజలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనధికారంగా మద్యం కలిగిన వారిపై 14 కేసులు నమోదు చేసి, 14మందిని అరెస్టు చేసి, 382 మద్యం బాటిళ్లు, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసామన్నారు. జిల్లా వ్యాప్తంగా విస్తతంగా వాహన తనిఖీలు చేపడుతూ మోటారు వాహన చట్టం అతిక్రమించిన వారిపై 3,756 ఈచలానాలను విధించామన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపిన వారిపై 179కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగిస్తున్న వారిపై 459 కేసులు, అర్ధరాత్రుళ్లు సహేతుకరమైన కారణాలు లేకుండా బలాదురుగా తిరిగిన వారిపై 254 కేసులు నమోదు చేసినట్లు ఎస్‌పి తెలిపారు.

రాష్ట్రపతిని కలిసిన ఎమ్‌పి కలిశెట్టి

ప్రజాశక్తి-విజయనగరంకోట

భారత దేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు తమ కుటుంబ సమేతంగా మంగళవారం కలిశారు. రాష్ట్రపతికి మర్యాద పూర్వకంగా పుష్ప గుచ్ఛం అందించారు. ఆనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా విజయ నగరంలో ఏర్పాటు చేయబోతున్న మహిళల సమావేశానికి రావాలని రాష్ట్రపతిని ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత కార్మికులు నేసిన చీరను రాష్ట్రపతికి కలిశెట్టి కుటుంబ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతితో ఎంపి మాట్లాడుతూ రానున్న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయనగరం పార్లమెంట్ లోని 7 నియోజకవర్గాల్లో వెనుకబడిన వర్గాలైన మహిళలతో కార్యక్రమం చేపట్టామని, వారు వారి జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్ళే విధంగా వారిని మోటివేట్ చేయడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించాలని అనుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి వచ్చి మహిళల్లో స్ఫూర్తి నింపాలని కోరారు. దీనికి రాష్ట్రపతి సమ్మతించినట్లు ఎంపి తెలిపారు.



రాష్ట్రపతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు

కరాటేలో సాయికృష్ణకు బంగారు పతకం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరంలోని రాజీవ్ స్టేడియంలో ఆదివారం జరిగిన కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో కోరుకొండలోని వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి ఎం.సాయికృష్ణ బంగారు పతకం సాదించాడు. ఈ సందర్భంగా సాయికృష్ణను పాఠశాల చైర్మన్ సీతయ్య, పాఠశాల డైరెక్టరు ఎ.వీరాస్వామి, ప్రిన్సిపాల్ బి.లక్ష్మణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అప్పలస్వామి, ఉపాధ్యాయులు అభినందించారు.



సాయికృష్ణను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్



దీక్ష చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆయాను విధుల్లోకి తీసుకోవాలి

రెండోరోజుకు చేరిన అంగన్‌వాడీల రిలే నిరాహారదీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గజపతినగరం ప్రాజెక్టు పరిధిలో అక్రమంగా తొలగించిన రామన్నపేట అంగన్వాడీ కేంద్రం హెల్పర్ మానాపురం సౌజన్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, అక్రమంగా తొలగించిన ఐసిడిఎస్ పీడీ, పిఒలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సి ఐ టి యు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్ష మంగళవారం రెండోరోజుకు చేరింది. నిరాహార దీక్షలను అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రామన్నపేటలో అంగన్వాడీ హెల్పర్ గా 2022పని చేస్తున్న సౌజన్యను టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ వేధింపులో భాగంగా తొలగించారని చెప్పారు. ఈ విషయమై రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయినా ఆమె తప్పుడు సర్టిఫికెట్లు పెట్టిందని ఆరోపిస్తూ గతనెల 30న తొలగించారని అన్నారు. మంత్రి స్పందించి సౌజన్యని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, పీడీ, సిడిపిఒలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరాహార దీక్షలకు ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేష్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి జోక్యం చేసుకొని సౌజన్యకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధితురాలు సౌజన్య, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నాయకులు కె.ప్రభావతి, సిహెచ్ రమణమ్మ, కె.నాగమణి, బి సునీత, ఎ.ఉషారాణి, బి.కరుణ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్సులో ఎస్ఎ1 ప్రశ్నపత్రాలు ఉంచాలి

డిఇఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బుధవారం నుంచి జరిగే ఎస్ఎ1 పరీక్షలకు సంబంధించిన ప్రశాపత్రాలను స్కూల్ కాంప్లెక్సుల్లో ఉంచాలని డిఇఒను యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు డిఇఒ మాణిక్యంనాయుడును కలిసి వినతి అందజేశారు. పరీక్షా పేపర్లు మండల విద్యాశాఖ కార్యాలయం నుంచి ప్రతి పాఠశాల ఉపాధ్యాయుడు వెళ్లి తీసుకుని రావాలని చెప్పారని, ఇది ఉపాధ్యాయులకు ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. స్కూల్ కంప్లెక్సుల్లో అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెఎవి ఆర్‌కె ఈశ్వరరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు జెఆర్‌సి పట్నాయక్ , జిల్లా కార్యదర్శులు సిహెచ్ తిరుపతి నాయుడు, జి.రాజారావు, అల్లు శంకరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.మురళీమోహన్ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో పల్లవికి బంగారు పతకం

జాతీయ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్ర విశ్వ కలాపరిషత్ తరపున గుంటూరు నాగార్జున యూనివర్శిటీలో జరిగిన సౌత్ వెస్ట్ జోన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్య డిగ్రీ కళాశాల విద్యార్థి పల్లవి బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఎస్.పల్లవి 71 కేజీల విభాగంలో 90కేజీల స్నాచ్, 117 కేజీల క్లీన్ అండ్ జెర్క్ మొత్తం 202 కేజీల బరువును ఎత్తి బంగారు పతకం సాధించింది. పల్లవి తో పాటు మరో ముగ్గురు విద్యార్థులు అంతర్ యూనివర్శిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి తెలిపారు. ఎ.యశశ్రీ, బి.నీరజ (మొదటి సంవత్సరం), ఎస్.పల్లవి, ఆర్.రాంబాబు (సెకెండ్ ఇయర్) జనవరిలో హిమాచల్ ప్రదేశ్ లో జరిగే అంతర్ యూనివర్శిటీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న శశిభూషణరావు, ప్రిన్సిపాల్



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

శ్మశానానికి స్థలం కేటాయించండి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పట్టణంలోని ఒకటవ వార్డుకు చెందిన ఎస్‌టి, పిటిజి తెగకు చెందిన గిరిజన ప్రజలు తమకు శాశ్వతంగా శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ భరత్ కుమార్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను నాయకులు, అధికారులు అండదండలతో చాలా మంది కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ఓ పక్క రాజ్యాంగం ఎస్‌సి, ఎస్‌టిలకు శ్మశానవాటికలు కేటాయించాలని చెబుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తమ పూర్వీకుల కాలం నుంచి వినియోగిస్తున్న సర్వే నెంబర్ 164/2లో సుమారు 3 ఎకరాల 200 గజాల స్థలాన్ని కబ్జాదారుల నుంచి రక్షించి తమకు అప్పగించాలన్నారు. అదే గ్రామానికి చెందిన రాకోటి శివ శ్మశానానికి రోడ్డును కూడా వేయనీయకుండా అడ్డుతగులుతున్నాడని వివాదం చేసేవాడని శ్మశానానికి కేటాయించిన స్థలాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాకోట మణి, రాకోట లక్ష్మి, గొర్లి కన్నతల్లి, రాకోటి చంద్రకళ, గేమ్మెల రాములమ్మ, గొర్ల సన్యాసమ్మ, చీమల ఎర్రయమ్మ, రాకోటి రమణమ్మ, గొర్లి గంగ, సిరిడ లక్ష్మి, రాకోటి లక్ష్మి, బొడ్డు త్రివేణి, బొడ్డు పద్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జాతీయ స్థాయి పోటీలకు తమ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు డైట్ ప్రిన్సిపాల్ జి.పగడాలమ్మ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు 6గురు విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. 9న విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో స్థానిక ఎంజెపి కళాశాలకు చెందిన పి. సౌజన్య మణి దృశ్య కళలు అంశంలో ప్రథమ స్థానం, విజయనగరం భాస్కర్ ఐఐటి అకాడమీకి చెందిన బి. శివాత్మిక వాద్య సంగీతంలో ప్రథమ స్థానం, సంప్రదాయ కథలు అంశంలో ఎస్.తేజశ్విని, బి.నవ్య ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వారిని ప్రిన్సిపాల్ జి. పగడాలమ్మ, వైస్ ప్రిన్సిపాల్ కె. రామకృష్ణ, అధ్యాపకులు రవికుమార్, సూర్యారావు, రామకృష్ణ, ఈశ్వర రావు, భరణి అభినందించారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

గ్రామ పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిడిఒ రత్నం కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు రెండు రోజుల శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, హెల్త్, వైల్డ్ వెల్ఫేర్, క్లీన్ అండ్ గ్రీన్, సెల్ఫ్ సెక్యూరిటీ, ఇన్ఫ్రాస్ట్రక్చర్, సామాజిక న్యాయం, విలేజ్ గుడ్ గవర్నెన్స్ వంటి తదితర 9 రకాల అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే కాకుండా సమస్యలు లేని గ్రామాలుగా చేయాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి వెంకటరమణ, ఏసిడిపిఓ సూపర్వైజర్ సూర్యకుమారి, టిఒటిలు శ్రీనివాస్, నడిమింటి వాసుదేవరావు, గ్రామ కార్యదర్శులు, పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కమిటీ

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు కేంద్రాలుగా ఎంపిక చేసిన జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, విద్యార్థి ఉన్నత పాఠశాలలను మంగళవారం త్రిమెన్ కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ కమిటీలో సభ్యులుగా వ్యవహరిస్తున్న ఎంఇఒ. పి.బాల భాస్కరరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్‌ఎస్ వర్మ, సోంపురం ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు అక్కడ సౌకర్యాలను పరిశీలించారు.

గృహాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో అర్హులైన పేదలకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలని సిపిఐ, ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు ఎం.పాపారావు, కె.అప్పలసూరి కోరారు. మంగళవారం వారు స్థానిక రెండవ సచివాలయం కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు గత 30 ఏళ్ల నుంచి ఇల్లు లేక పాత ఇళ్లలో ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారని వారికి కూటమి ప్రభుత్వం పక్కా గృహాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లెంక రాములమ్మ తదితరులున్నారు.

మహిళా పోలీసులు అప్రమత్తం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ బి.గణేష్ సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలో జరుగుతున్న సంఘటనల పట్ల మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండి తమకు సమాచారమివ్వాలన్నారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో మద్య పానం, గంజాయి విక్రయాలు, వినియోగం, మహిళలు, బాలికలపై దాడులు వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు.

మహిళకు సన్మానం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో వరల్డ్ టాయిలెట్ డే ముగింపు సందర్భంగా వేపాడ గ్రామానికి చెందిన సేనాపతి లక్ష్మి వ్యక్తిగతంగా మరుగుదొడ్డిని నిర్మించుకొని పరిశుభ్రంగా ఉపయోగించుకున్నట్లు గుర్తించి ఆమెను ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జ్ ఎంపిడిఒ. ఎస్.ఎస్.వర్మ, సీనియర్ అసిస్టెంట్ పివి మహేష్, జూనియర్ అసిస్టెంట్ డి శ్రీనివాస్, మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ గొర్లె రాంబాబు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సక్రమ జీవన విధానంతోనే ఆరోగ్యం

ఊపిరితిత్తుల వైద్య నిపుణులు చరిష్మా

ప్రజాశక్తి - బొబ్బిలి

సక్రమ జీవన విధానాన్ని మెరుగు పరచుకున్నపుడే ఆరోగ్యం కలిగి ఉండవచ్చునని అనిల్ నీరుకొండ హాస్పిటల్ ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ చరిష్మా, కిడ్నీ వ్యాధి నిపుణులు డాక్టర్ సురేష్ రెడ్డి అన్నారు. మంగళవారం బొబ్బిలి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఎనీల్ హాస్పిటల్ సహకారంతో అంతర్జాతీయ రోటరీ సంస్థ రూపొందించిన 'డిసీస్ ప్రివెన్షన్ మంత్'లో భాగంగా కిడ్నీ, ఊపిరి తిత్తుల ఉచిత వైద్య శిబిరాన్ని రోటరీ క్లబ్ అధ్యక్షులు సింద్రి శ్రీనివాసన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని రోటరీ జిల్లా చైర్మన్ జె సి రాజు ప్రారంభించారు. అనంతరం డాక్టర్ చరిష్మా ఊపిరితిత్తుల వ్యాధులు, చికిత్స, వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కిడ్నీ వ్యాధి నిపుణులు డాక్టర్ సురేష్ రెడ్డి కిడ్నీలో రాళ్లు, మూత్ర సమస్యలు, బరువు పెరగడం రక్త మార్పిడిపై అవగాహన కల్పించారు. జెసి రాజు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాలు, ఉచిత వైద్య పరీక్షలను వాటితో పాటు ఉచితంగా మందులను అందిస్తున్నామన్నారు. హాజరైన రోగులకు ఉచితంగా ఊపిరితిత్తుల పనితీరు పరీక్షలను, కేయటిన్ రక్త పరీక్షలను నిర్వహించి రోగులను పరీక్షించారు. ఈ శిబిరంలో 153 మందికి వివిధ పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు కె నాగరాజు, కె రామకృష్ణ, హాస్పిటల్ సిబ్బంది అనిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆటో నుంచి జారిపడి మహిళా మృతి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని గోవిందపురం గ్రామానికి చెందిన కొమ్మూరి వరలక్ష్మి (45) అనే మహిళ ప్రమాదవశాత్తు ఆటోలోంచి జారిపడి మృతి చెందింది. గోవిందపురం వద్ద ఆటో ఎక్కిన ఆమె ఆటోలో ప్రయాణిస్తూ అగ్రహారం జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపటం వల్ల ఆటో నుంచి జారిపడిపోయి తలకు బలమైన గాయమై చనిపోయింది. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అర్జీలకు ఆధారాలు తప్పనిసరి

ప్రజాశక్తి - భోగాపురం

గతంలో మరణించిన వారి మరణ ధ్రువపత్రాల కోసం తప్పనిసరిగా వారికి సంబంధించిన ఆధారాలను జతచేయాలని ఆర్‌డిఒ దాట్ల కీర్తి అన్నారు. మండలంలోని ఏ రావివలసలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. భూముల ఆన్ లైన్ల కోసం సంబంధిత కుటుంబ సభ్యులైన తాత తండ్రుల మరణ ధృపత్రాలను అడుగుతున్నారని, వాటికోసం దరఖాస్తు చేస్తే రిజెక్ట్ చేస్తున్నారని ఆమెకు తెలిపారు. దీనిపై ఆర్‌డిఒ మాట్లాడుతూ వారికి సంబంధించిన ఓటర్ కార్డు లేదా రేషన్ కార్డు వంటివి తప్పనిసరిగా జతచేయాలన్నారు. విమానాశ్రయానికి సంబంధించిన అప్రోచ్ రోడ్డు పరిహారం కోర్టులో ఉన్నందున దానిపైన కూడా ప్రత్యేక దృష్టి పెడుతున్నామని తెలిపారు. ఆన్‌లైన్‌లో రైతుకు జీరో విస్తీర్ణం, అన్‌నౌన్ వంటివి చూపిస్తున్నందున అలాంటివి తహశీల్దార్ ద్వారా వస్తే పరిష్కరించేందుకు కొంత సమయం పడుతుందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఈ రైతు సదస్సులను రైతులందరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ సదస్సులో తహశీల్దార్ మామిడి సురేష్, ఆర్ఐ షేక్ ఇమ్రాన్, ఉప సర్పంచ్ నాయుడు, సచివాలయ సిబ్బంది, విఆర్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి: గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని తహశీల్దార్ డి. రాజేశ్వర రావు కోరారు. మంగళవారం మండలంలోని దేవుపల్లి, ఇనగంటి వెంకన్న అగ్రహారం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ డి.రాజేశ్వరరావు మాట్లాడుతూ భూ సంబందిత సమస్యలపై రైతులు సదస్సులలో అర్జీలు ఇచ్చినట్లైతే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రైతులు అర్జీతో పాటు తమ వద్ద ఉన్న భూ సంబందిత డాక్యుమెంట్లను జత చేయాలని సూచించారు. ఈ సదస్సులను నియోజకవర్గ ప్రత్యేకాధికారి ప్రమీల గాంధీ, మండల స్పెషల్ ఆఫీసర్ సాల్మన్‌రాజు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చల్ల చలంనాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్య ప్రకాశ రావు, సర్పంచ్ గండ్రేటి రమణమ్మ, మాజీ ఉప సర్పంచ్ రాపాక అచ్చం నాయుడు, ఆర్.ఐ హరికృష్ణ, విఆర్‌ఒ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో ఆర్‌డిఒ కీర్తి



భోగాపురం: సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ దాట్ల కీర్తి

డెంకాడ: గ్రామాల్లో నెలకొని ఉన్న రైతుల రెవెన్యూ సమస్యలను పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ రెవెన్యూ సదస్సుల ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ సుధారాణి తెలిపారు. మండలంలోని అక్కివరంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ చాలా కాలం నుంచి రెవెన్యూలో సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వం ఈ సదస్సులను ఏర్పాటు చేసిందని చెప్పారు. రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఝాన్సీ, సర్వే డిటిలు పాల్గొన్నారు.

భూహక్కులు కల్పించండి

రేగిడి: భర్త చనిపోయిన అనంతరం భార్యకు భూమిని హక్కుదారులుగా చేయాలని మజ్జి రాముడు పేట గ్రామానికి చెందిన కొమ్ము జయమ్మతో పాటు మరి కొంతమంది రైతులు రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ చిన్నరావుకు అర్జీలు చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం గుల్లపాడు, అప్పాపురం పంచాయతీలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ రెండు పంచాయతీల్లో వచ్చిన అర్జీలను పోర్టల్‌లో నమోదు చేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వీరితోపాటు విఆర్‌ఒ దుర్గారావు, శ్యామల కుమారి, నాయకులు ఉన్నారు.

వినతులు స్వీకరణ

విజయనగరం టౌన్ : నగరంలోని అద్దేపల్లి వారి వీధిలోని రామమందిరం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సులో నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య, తహశీల్దార్ కూర్మనాధ్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలనుంచి వస్తున్న వినతుల్లో ఎక్కువ భాగం భూ సమస్యలేనని చెప్పారు. ప్రతీఒక్కరూ తమ భూముల రికార్డులను ఒకసారి పరిశీలించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు.

వి.పద్మావతి, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, గ్రామ సర్పంచ్ కంది కిరణ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని వీలుపర్తి, వెల్దాం గ్రామాలోల మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి 13 దరఖాస్తులు అందినట్లు తహశీల్దార్ జె. రాములమ్మ తెలిపారు. ఈ సమస్యలను 45 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఈ సదస్సులో గ్రామ సర్పంచ్ సేనాపతి లీల, గ్రామ పెద్ద సేనాపతి అప్పారావు, ప్రత్యేకాధికారి లక్ష్మీ నరసింహం, డి.సన్యాసినాయుడు, ఎంఆర్ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ సులోచనారాణి కోరారు. మండలంలోని రావివలస గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో జరిగిన రీ సర్వే వల్ల ఉత్పన్నమైన సమస్యలను పరిష్కరించడానికి ఈ సదస్సులు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి బోయిన లూర్థమ్మ, రెవెన్యూ శాఖాధికారులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు పెడుతున్నామని తహశీల్దారు రాజారావు అన్నారు. చీపురుపల్లి పంచాయతీ పరిధిలో గల జి అగ్రహారం రెవెన్యూ పరిధిలోని సచివాలయంలో మంగళవారం జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 22ఏ, ఫ్రీ హోల్డ్, భూ ఆక్రమణలపై ఫిర్యాదులు స్వీకరించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అద్యక్షుడు రౌతు కామునాయుడు, నియోజకవర్గ జనసేన అద్యక్షుడు విసినిగిరి శ్రీనివాసరావు, జనసేన జిల్లా కోఆర్డినేటర్ కోట్ల కృష్ణ, పంచాయతీ ఇఒ పాల్గొన్నారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరంలీగల్

అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి ఆదేశాల మేరకు జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్లో న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి టివి రాజేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన నాలుగవ అదన జిల్లా న్యాయమూర్తి బి.అప్పలస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ ఎలాంటి వివక్ష లేకుండా సమాన హక్కులతో జీవించాలని ఐక్యరాజ్యసమితి లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇందుకోసం 1948 డిసెంబర్ 10న పారిస్ వేదికగా సభ్య దేశాలన్నీ ఒక కీలక ఒప్పందంపై సంతకం చేశాయని, అప్పటి నుంచి ప్రతి సంవత్సరం డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. టివి రాజేష్ కుమార్ మాట్లాడుతూ హక్కులు లేని మనిషి బానిసతో సమానమని,మనిషి స్వతంత్రంగా జీవించి తన మనుగడ కాపాడుకోవడానికి హక్కులు సహకరిస్తాయని తెలిపారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి అప్పలస్వామి

హక్కుల రక్షణకై ఉద్యమిద్దాం

విజయనగరం టౌన్ : మానవ హక్కుల కోసం మహిళలంతా ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ అన్నారు. మానవ హక్కుల దినం సందర్భంగా 46వ డివిజన్‌లో ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం నుద్దేశించి ఆమె మాట్లాడారు. రోజురోజుకూ మహిళల పట్ల అత్యాచారాలు పెరుడుతున్నాయని, బాలల హక్కులను పాలకులు హరిస్తున్నారని అన్నారు. మరో వైపు మనువాద రాజ్యాంగం అమలులోకి తెచ్చేందుకు మతోన్మాద వాదులు కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాజ్యంలో పేర్కొన్న లౌకిక తత్వం, సమానత్వం, మానవ హక్కుల రక్షణ కోసం ఉద్యమిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లాసహాయ కార్యదర్శి వి. లక్ష్మీ, పాల్గొన్నారు

హక్కులను సాధించుకుందాం

విజయనగరం కోట : విశ్వమానవ హక్కులను సాధించుకుందామని నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గాజుల రేగ నారాయణ పబ్లిక్ నిర్వహించిన కార్యక్రమంలో ముందు గా విద్యార్థులు ఆంగ్ల అక్షరమాలలో హెచ్‌ఆర్‌డిగా కూర్చుని ఎంతగానో ఆకట్టుకున్నారు. విద్యార్థులు సమగ్ర జీవన సాధికారిత ను ఫలవంతం చేద్దామని నినదించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐద్వా నాయకులు రమణమ్మ

డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన

డొమిస్టిక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన మానవ హక్కుల దినోత్సవం ఆనందగజపతి ఆడిటోరియం ఆవరణలో జరిగింది. ముఖ్యఅతిథిగా న్యాయవాది పి.శ్రీనివాస్ మాట్లాడారు. హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని అన్నారు. ఇంటి పనివార్లకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని, ఎనిమిది గంటలు పని చేస్తే పదివేల రూపాయలు జీతం చెల్లించాలని అన్నారు. పని ప్రదేశాల్లో రక్షణ కల్పించాలన్నారు. యూనియన్ జిల్లా కోఆర్డినేటర్ కోరుకొండ వరలక్ష్మి మాట్లాడుతూ వివక్షలేని జీవనం గడవడానికి హక్కులు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్.భారతి, బి.పుణ్యవతి, జి.పైడిరాజు, ఎస్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల సర్వే పూర్తి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని వెల్దూరు సచివాలయం పరిధిలో పింఛన్‌లు పరిశీలన పూర్తి చేసినట్లు ఎంపిడిఒ ఎం. రాధిక తెలిపారు. 11 టీమ్‌లు ద్వారా 437 పింఛన్‌లకు గానూ 425 పింఛన్‌లు సర్వే చేసామన్నారు. 12 కుటుంబాలు అందుబాటులో లేకపోవడంతో అందుబాటులో లేరని ఆప్షన్ పెట్టామన్నారు. సర్వేలో డెత్ సర్టిపికెట్లు లేనివారికి వ్యక్తిగత డిక్లేరేషన్ రాయించి పెట్టామన్నారు. సర్వే పూర్తయ్యిందని ఆమె తెలిపారు. అయితే ఎవరూ అర్హులు, ఎవరు అనర్హులు అన్నది తమకు తెలీదన్నారు. ట్యాబ్‌లు ద్వారా ఇచ్చిన ఆప్షన్‌లను నింపి పంపించామని చెప్పారు. అవన్నీ సిఎం డ్యాస్ బోర్డుకు వెలతాయన్నారు. అక్కడ అర్హులను తేల్చుతారని స్పష్టం చేశారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలను ఎంఇఒలు జగదీశ్వరరావు, బాల భాస్కరరావు మంగళవారం సందర్శించారు. పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో సమావేశమై శత శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకాన్ని ఏ విధంగా విద్యార్థులకు అందిస్తున్నారో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

పాడిపరిశ్రమపై ప్రత్యేక దృష్టి పెట్టాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పూసపాటిరేగ

గ్రామీనులంతా పాడిపరిశ్రమపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మంగళవారం మండలంలోని కొవ్వాడ అగ్రహారంలో పశుసంవర్ధక శాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరంతోపాటు లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులంతా గోవులను పెంచాలన్నారు. తద్వారా ఈ ప్రాంతంలో డైరీ ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఉందన్నారు. ఈ ప్రాంతంలో ఉత్పత్తయిన పాలను మద్దతు ధరకే కొనుగోలు చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. పాడి పరిశ్రమతోపాటు కోళ్ల పెంపకం ఎంతో లాభదాయకం అన్నారు. కోళ్ల పెంపకంతో పాటు వాటిని మార్కెట్ చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతి మహిళా వీటిపై దృష్టి పెట్టాలన్నారు. వారికి కావాల్సిన సహకారం అందిస్తామన్నారు. కొవ్వాడ అగ్రహారం అభివృద్ధికి సహకరిస్తామన్నారు. సర్పంచ్ కోట్ల రఘు మాట్లాడుతూ ఈ 6 నెలల్లో తమ గ్రామానికి కాలువలు నిమిత్తం రూ. 30 లక్షలు మంజూరు చేసారన్నారు. దాంతో పాటు తమ గ్రామం నుండి చోడమ్మ అగ్రహారానికి లింక్ రోడ్డులు రూ. 2.5 కోట్లుతో మంజూరు చేస్తున్నారన్నారు. గ్రామంలో దళితుల శ్మశాన వాటికకు రూ.10 లక్షలు సొంత నిదులు వెచ్చించి నిర్మాణ పనులు రేపటి నుంచే ప్రారంభిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ వై.వి.రమణ, జనసేన మండల పార్టీ అధ్యక్షులు జలపారి శివ, మండల కోఆర్డినేటర్ గుడివాడ జమరాజు, నాయకులు పతివాడ శ్రీను, బాలా అప్పలరాజు, శంకాబత్తులు సత్తిబాబు, మహంతి శివతో పాటు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ రాధాకృష్ణ, నెల్లిమర్ల పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్. జి.చక్రవర్తి, గరివిడి పశువైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్. ప్రకాష్, పశు వైద్యాధికారులు రాజ రాజేశ్వరి, సుధీర్, ఈశ్వర్ శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

మహిళా మార్ట్‌లో పెట్టుబడికి

లాభాలు ఎప్పుడు ఇస్తారు?

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మహిళా సంఘాల నుంచి సేకరించిన సొమ్ముతో నడుపుతున్న మహిళ మార్ట్ నుంచి మహిళా సంఘాలకు లాభాలు ఎప్పుడు ఇస్తారని మండలంలోని వసి గ్రామ మహిళా సంఘాల మహిళలు వెలుగు ఎపిఎంను మంగళవారం నిలదీశారు. వశి గ్రామ పంచాయతి ఆఫీస్‌లో ఆ గ్రామ మహిళా ప్రెసిడెంట్ అండ్ సెక్రటరీల సమావేశం మహిళా సమాఖ్య ప్రెసిడెంట్ కారుకొండ సత్యవతి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఒక్క వశి గ్రామంలో ఉన్న 29 సంఘాల నుంచి రూ.87వేలు మహిళా మార్ట్‌లో పెట్టుబడి నిమ్మితం వసూలు చేసారని 3 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా లాభాలు ఇవ్వలేదని ఆగ్రహించారు. గత 5నెలల నుంచి సీసీలు గ్రామ సంఘాల సమావేశం ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. దానికి సమాధానంగా వెలుగు ఎపిఎం, సీసీ మాట్లాడుతూ తాము కొత్తగా వచ్చామని, ఇంకా ఏ విషయమూ తమకు తెలియదని అన్నారు. గ్రామంలో విఒఎగా పనిచేసిన గుడిసె త్రివేణిని ఏ కారణంతో తొలగించారని ప్రశ్నించారు. కొత్త వ్యక్తిని నియమిస్తే గ్రామంలో ఉన్న మెజారిటీ సంఘాల ప్రతినిధులు తీర్మానం తీసుకొని అప్పుడు కొత్త వారిని నియమించాలని, అలా కాకుండా ఏ నిబంధనలు ప్రకారం నియమించారని ప్రశ్నించారు. ఇందుకుగాను ఎపిఎం మాట్లాడుతూ తాను వచ్చి సుమారు 2నెలలు అయిందని, తనికి ఈ విషయంపై పూర్తి అవగాహన లేదని, మరలా గ్రామసంఘానికి నోటీసు ఇచ్చి మీటింగ్ పెట్టి మెజారిటీ సంఘాల ప్రతినిధిలు తీర్మానం తీసుకొని అప్పుడు ఆ వ్యక్తిని విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల దోపిడీని అడ్డుకోండి



నిరసన తెలుపుతున్న వామపక్ష , ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి- బొబ్బిలి

అదాని స్మార్ట్ మీటర్ల దోపిడీని ఆదిలోనే అడ్డుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. శంకరరావు, వామపక్ష ప్రజా సంఘాల నాయకులు మునకాల శ్రీనివాసరావు, వేమిరెడ్డి లక్ష్మునాయుడు, ఎస్.గోపాలు అన్నారు. మంగళవారం పట్టణంలో విద్యుత్తు ఛార్జీల పెంపునకు నిరసనగా 5,6,7 వార్డుల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కరెంటు ఛార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు పెంచడం సరికాదన్నారు. స్మార్ట్ మీటర్లు వద్దని, పెడితే పగలగొట్టాలని కూటమి నేతలు ప్రతిపక్షంలో ఉండగా పిలుపునిచ్చారని ఇప్పుడు ఎలా పెడతారని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల వల్ల ఫోన్లో బ్యాలెన్స్ వేయించుకున్నట్లు కరెంటుకు బ్యాలెన్స్ వేయించుకోవాలన్నారు. డబ్బు అయిపోగానే కరెంటు ఆగిపోతుందని, మళ్ళీ రీఛార్జి చేయించుకోవాలని చెప్పారు. ఈ స్మార్ట్ మీటర్‌కు అయ్యే రూ.15వేలు ఖర్చు కూడా వినియోగదారుల నుంచే వసలూ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బాడంగి: స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సిపిఎం మండల నాయకులు సురేష్ కోరారు. మండల కేంద్రంలోని మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను ముందు ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, తరువాత షాపులు, పలు సంస్థల కార్యాలయాల్లోనూ ఏర్పాటు చేస్తున్నారని, భవిష్యత్తులో ఇళ్లలోకి కూడా స్మార్ట్ మీటర్లను బిగించి డబ్బులు వసూలు చేస్తారని చెప్పారు. ఈ ప్రీ పెయిడ్ మీటర్ వల్ల ఫోన్‌లో బ్యాలెన్స్ వేసుకున్నట్లే కరెంట్‌కి కూడా బ్యాలెన్స్ వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, పాల్గొన్నారు.

రామభద్రపురం: కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీకి కొమ్ముకాయడమే కాకుండా ఎంతో లాభదాయకంగా వ్యవహరిస్తుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం ఆర్‌టిసి బస్టాండ్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంపదను కొల్లగొడుతున్న అదానీని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మిటర్ల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మహిళా నాయకులు లెంక లక్ష్మీ, సిపిఎం నాయకుడు రామిరెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు వినతి

భోగాపురం: నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఎం చంద్రబాబుకు మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సచివాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి నియోజక వర్గంలోని ప్రధాన సమస్యలపై వివరించినట్లు బంగార్రాజు తెలిపారు.

పశువుల అక్రమ రవాణాపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

పశువులు అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ జెవివిఎస్ రామ్మోహనరావు ఆదేశించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో మంగళవారం జంతు సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారపు సంతలు నుంచి పశువులు అక్రమ రవాణా జరుగుతున్నాయని, పశువులు అక్రమ రవాణాపై నిఘా పెట్టాలని కోరారు. జంతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేసిన చట్టాలను అమలు చేసి అక్రమ రవాణా అరికట్టాలన్నారు. గ్రామాల్లో కోడి, పొట్టేలు పందేలు జరగకుండా చూడాలన్నారు. దేవాలయాలకు 300 మీటర్ల దూరం లోవు ఎటువంటి జంతు బలి జరగకుండా చూడాలన్నారు. రాష్ట్ర గోసంరక్షణ సమైఖ్య రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడుతూ బొబ్బిలి నుంచి బొండపల్లి వరకు హైవే మీదుగా ప్రతిరోజూ పశువులు అక్రమ రవాణా రాత్రి పగలు తేడా లేకుండా చేస్తున్నారన్నారు. దీనిపై అధికారులు ఎటువంటి కేసులూ నమోదు చేయలేదన్నారు. ప్రతి మండలంలో జంతు సంక్షేమ కమిటీలు ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ పశురవాణా అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో బొబ్బిలి పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజగోపాల్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.విష్ణు, డివిజనల్ పంచాయతీ అధికారి ఆరికతోట మోహనరావు, దత్తిరాజేరు డిప్యూటీ తహశీల్దార్ టి.రత్నకుమారి, ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ సమైఖ్య రాష్ట్ర కార్యదర్శి కెవియర్ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

ఒమ్మి పంచాయతీ పరిధిలోని లోతు గెడ్డ ఆక్రమణలను రెవెన్యూ అధికారులు మంగళవారం తొలగించారు. ఒమ్మి గ్రామ పరిసరాల్లో లోతుగెడ్డను కొంతమంది ఆక్రమించినట్లు అందిన సమాచారంతో తహశీల్దారు బి.సుదర్శనరావు స్పందించారు. వెంటనే ఆక్రమణలను తొలగించాలని, ఆక్రమణదారులకు హెచ్చరికలు జారీ చేయాలని ఇచ్చిన ఆదేశాల మేరకు విఆర్‌ఒ మహేంద్ర, విఆర్ఎ వీరాస్వామి తదితరులు ఆ స్థలానికి వెళ్లి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టిన కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ సుదర్శన్ రావు హెచ్చరించారు.

మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.NO: 118/2020.

బిట్వీన్ :
రౌతు లోకేశ్వర రావు. ....వాది.
అండ్ :
రౌతు సింహాచలం, వగైరాలు ....ప్రతివాదులు.

నోటీసు

D.4, Lanka Rama w/o Ramesh, Ippalavalasa village, Gajapathinagaram Mandalam, Vizianagaram District.

పిటీషను పరిహారములు కోరుచు పిటీషనర్లు పిటీషను దాఖలు చేసినందున యిందు విషయమై మీకు ఆక్షేపనలున్న యెడల **తే 16-12-2024 దికి** శ్రీకోర్టు వారు వాయిదా వేయింపించియున్నారు. వాయిదా దినం **ఉదయం 10-30 గం॥** లకు మీరు గానీ, మీవలన అర్డరు పొందినవారు గానీ, మీ తరపున వకీలు గారు గానీ, పై కోర్టులో హాజరు అయి మీ తరపున వాదన దాఖలు చేసుకొనవలెను. లేనిచో పై దావా మీ ప రోక్షమున తీర్మానం జరుగునని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

మత్స బెనర్జీ
పిటినరు తరుపు న్యాయవాది.
బొబ్బిలి